


వివరాలు మెయిన్‌లో

తక్షణమే ప్రజా నాట్యమండలి కళాకారులకు గుర్తింపు కార్డులు

ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 04 మే , 2026 | పేజీలు : 04

# కొలువుల ఎర.. కోట్ల దోపిడీ!



## నిరుద్యోగులకు ఉద్యోగాల పేరుతో పంగనామాలు

**ప్రజాపక్షం/నకిరేకల్:** నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని దేవుడి సేవ పేరుతో హుండీ లెక్కింపు ఉద్యోగాల ముసుగులో కోట్ల రూపాయలు దోచుకున్న భారీ మోసం బాధితుల ఫిర్యాదులతో నకిరేకల్‌లో వెలుగులోకి వచ్చింది. కరీంనగర్ జిల్లా రామగిరి మండలం సుందిళ్ల గ్రామానికి చెందిన పులి రవి అనే వ్యక్తి రవి సేవా సమితి పేరుతో ఈ దందా నడిపినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.పలు పనులు చేసినా ఆశించిన ఆదాయం రాక, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో నిరుద్యోగులనే లక్ష్యంగా చేసుకుని ఈ మోసానికి తెరలేపినట్లు చెబుతున్నారు.కరీంనగర్ కేంద్రంగా సమితిని నడుపుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక,తమిళనాడులో సేవా కార్యక్రమాలు నిర్వహించిన అనుభవాన్ని అడ్డంగా పెట్టుకుని దేవాదాయశాఖలో హుండీ లెక్కింపు పనులు ఇప్పిస్తానంటూ యువతను వలలో వేసినట్లు తెలుస్తోంది. కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారం, మునుకుంట్ల, కట్టంగూరు టౌన్, కురుమూర్తి, నకిరేకల్ మండలంలోని నోముల,గోరింకలపల్లి గ్రామాలకు చెందిన యువకులతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరెందరినో మధ్యవర్తుల ద్వారా సంప్రదించి ఒక్కో వ్యక్తి నుంచి రూ.1లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఐడీ కార్డులు,బుక్లెట్లతో నమ్మకం**

అన్నవరం, శ్రీశైలం, తిరుపతి, శ్రీకాళహస్తి తదితర ఆలయాలకు హుండీ లెక్కింపు పేరుతో తీసుకెళ్లి వీఐపీ దర్శనం, లడ్డూ ప్రసాదం ఇప్పించి నమ్మించాడు. శాలరీ బాక్స్ యాప్‌లో ఫోటో పంచ్, ఐడీ కార్డులు, బుక్లెట్లు ఇచ్చి ఉద్యోగం నిజమనే భావన కలిగించాడు. విజయవాడ కనక దుర్గమ్మ గుడి సిబ్బంది ఇక్కడ ఎలాంటి ఉద్యోగం లేదు" అని చెప్పడంతో మోసం బయటపడింది.

**స్థానిక ఏజెంట్ల పాత్రపై అనుమానాలు**

మేము రవిని చూడలేదు.. స్థానికుల ద్వారానే చేరాం" అని బాధితులు చెబుతున్నారు. ఒక్కో అభ్యర్థిపై రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఏజెంట్లు కమిషన్ తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నకిరేకల్, నల్లగొండ, కట్టంగూరు ప్రాంతాల్లో రవికి కీలక ఏజెంట్లు ఉన్నట్లు బాధితులు పేర్కొన్నారు.

**కేసులు వద్దు.. సెటిల్మెంట్ చేసుకుందాం**

శనివారం బాధితులు నకిరేకల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేయగా,ఆదివారం నుంచే బాధితులకు ఫోన్లు చేయడం ప్రారంభించినట్లు సమాచారం. కొంత సమయం ఇవ్వండి.. సెటిల్మెంట్ చేసుకుందాం కేసులు వద్దు అంటూ ఒత్తిడి తెస్తున్నారని బాధితులు చెబుతున్నారు. మా డబ్బు లు మాకు పూర్తిగా చెల్లిస్తేనే కేసులు వెనక్కి తీసుకుంటాం అని వారు స్పష్టం చేస్తున్నారు.కేసులు పెట్టిన వారికే సెటిల్మెంట్ చేస్తే,ఇంకా బయటకు రాని మిగతా బాధితుల పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**మాకు న్యాయం చేయండి**
**బాధితుడు బద్దుల నరేందర్**



నెలకు ఆరు రోజులే పని, రూ.27 వేల జీతం,13 ఏళ్ల ఉద్యోగం అంటుండటంతో నమ్మి మోసపోయాం. ఉపాధి కోసం వెళ్ళాం. అప్పు చేసి మరి రూ.1.60లక్ష డబ్బులు కట్టాను మాకు న్యాయం చేయాలి అని బాధితుడు బద్దుల నరేందర్ వాపోయాడు.

**కేసు నమోదు.. చట్టపరమైన చర్యలు**
**నకిరేకల్ టౌన్ సిఐ హరిబాబు**



ఉద్యోగం పేరుతో మోసగించారంటూ ఫిర్యాదు ఇచ్చారు. కేసు నమోదు చేసి విచారణ చేపడతాం. వాస్తవాలు నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ ఉద్యోగాల పేరుతో మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడాలి అని నకిరేకల్ టౌన్ సిఐ హరిబాబు తెలిపారు.

# కళ్లాల్లో ధాన్యం.. రైతు కళ్లల్లో నీళ్లు



వివరాలు మెయిన్‌లో

# సాగర్‌లో మృత్యు మలుపులు.. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

## హెచ్చరిక కోసం వేసిన రంబుల్ స్ట్రిప్స్ ప్రమాదాలకు కారణమా?




**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లోని కొన్ని కీలక రహదారి మలుపులు మృత్యు మలుపులుగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బుద్ధవనం తర్వాత ఉన్న మూలమలుపు,పాత కంకర మిల్లు సమీపంలోని వంపు,దయ్యాల గండిగా పిలిచే ప్రాంతంలోని మలుపులు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.గత మూడు నెలల్లో ఈ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వాహనదారుల అభిప్రాయం ప్రకారం, రహదారి రూపకల్పనలో లోపాలతో పాటు ఇటీవల ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్ కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాహన వేగాన్ని తగ్గించేందుకు వేసిన రంబుల్ స్ట్రిప్స్‌పై అధిక వేగంతో వెళ్లినప్పుడు అకస్మాత్తుగా వచ్చే ప్రకంపనల వల్ల ద్విచక్ర వాహనాలు, తేలికపాటి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. 20 కిలోమీట్టరుల. స్పీడ్ లిమిట్ బోర్డులు ఉన్నా వాహనదారులు పట్టించుకోకుండా అతివేగంగా వెళ్తున్నారు.రహదారి పక్కన కంకర,గుంతలు, గ్రానైట్ రాళ్లు ఉండటం ప్రమాదాలను మరింత పెంచుతోంది.అధికారులు వెంటనే స్పందించి ఈ మలుపుల వద్ద స్పష్టమైన హెచ్చరిక బోర్డులు, సరైన సైన్ మార్కింగ్, రహదారి సమతుల్యత ఏర్పాటు చేయాలని,రంబుల్ స్ట్రిప్స్‌ను ప్రమాణాల ప్రకారం ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



## సురేపల్లిలో శ్రీ కంఠం మహేశ్వర స్వామి పండుగ

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి మండలం సురేపల్లి గ్రామంలో శ్రీ కంఠం మహేశ్వర స్వామి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, గ్రామ సర్పంచ్ కొండూరు దానమ్మ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల కేంద్రంలో చిన్నోజు రుక్మమ్మ అనారోగ్యంతో చనిపోవడం ఆమె మృతదేహాన్ని గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ పూలమాలేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, ఉప సర్పంచ్ మోటి రమేష్, వార్డు సభ్యులు మొహమ్మద్ అంజద్, గొరిగే శేఖర్, మొహమ్మద్ నాసర్, జెల్ల వెంకటేశం పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భువనగిరి కమిటీ, చేర్యాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని సింగారం,చామాపూర్, రేగులగుంట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం ను ఇంటింటా నిర్వహించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తన కాల జ్ఞానం లో తాడిపత్రి లోని ప్రబోధాశ్రమము ఉన్నతమైన జ్ఞానం కలిగినదనీ వారు అన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భువనగిరి కమిటీ, చేర్యాల కమిటీ, జనగామ కమిటీ సభ్యులు, దేవేందర్, శివరామకృష్ణ, సాయిరాజు, యాదగిరి, లింగస్వామి, అభినవ్, శ్రీరామ్ తారక్, లత, జయమ్మ, కవిత, లావణ్య, లలిత, హారిక, భావనలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని సర్నేనిగూడెం గ్రామానికి చెందిన నీల నరసింహ కుమారుడు వివాహానికి మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పోషబోయిన మల్లేశం, టిఆర్ఎస్ జిల్లా నాయకులు వెల్లంకి మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ తదితరులు పాల్గొన్నారు.

## -సామాజిక చైతన్య కళాకారుడు జహంగీర్

**సంస్మరణ సభలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**



**ప్రజాపక్షం/తుర్కపల్లి** :ప్రజా కళాకారుడు జహంగీర్ ఆటా..పాటా..ఎప్పటికి జనంబాటే, జనంతోటే ప్రయాణం ఉండేదని,తెలంగాణ ఉద్యమ పోరాటంలో పాటలో బాగమై,గద్దర్ అడుగుజాడల్లోని ప్రజల బాణీ అయి నిత్యం ప్రజాజీవితాన్ని గడిపాడని యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన సామాజిక ఉద్యమ కళాకారుడు స్వర్గీయ జహంగీర్ ఉద్యమాలను,పాటలను గుర్తుచేసి,ఆదివారంనాడు మండల కేంద్రంలోని జె ఎం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జహంగీర్ సంస్మరణ సభలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జహంగీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేదికపై కళాకారులు రూపొందిన పాటల సీడీ ని ఆవిష్కరించి మాట్లాడుతూ పాటల జహంగీర్ సామాజిక చైతన్యాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడని కొనియాడారు. యువ కళాకారులు జహంగీర్ మార్గాన్ని అనుసరించి,సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమల్ల వెంకటటేష్, మండల నాయకులు, కళాకారులు, కళాభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోమాత రక్షణకు ఆమరణ నిరాహార దీక్ష



**ప్రజాపక్షం/రామన్నపేట** : తెలంగాణ రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టాన్ని మరియు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తు.చ. తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ మరియు టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు కొలిశెట్టి శివకుమార్ ఆదివారం ఉదయం 10:00 గంటలకు ఖైరతాబాద్లోని శ్రీ త్రిశక్తి హనుమాన్ దేవస్థానంలో గోమాత రక్షణకై ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మా యొక్క ప్రధాన డిమాండ్లు హైకోర్టు ఆదేశాల అమలు (పిఐఎల్ నెం.5/2023) రాష్ట్ర సరిహద్దుల్లో తక్షణమే పటిష్టమైన చెక్ పోస్టులను ఏర్పాటు చేసి,గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి. బక్రీద్ పండగపై నిఘా ఏర్పాటు చేసి రాబోయే పండుగ సందర్భంగా ఒక్క గోవు కూడా అక్రమ వధకు గురికాకుండా నిఘా పెంచాలి. అక్రమ స్లాటర్ హౌస్లను తక్షణమే మూసివేయాలి.గోవులను రక్షిస్తున్న గోరక్షకులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేసి, అక్రమ కేసుల ఉపసంహరించుకోవాలి.కోర్టు తీర్పును అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ,ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం గోవధను పరోక్షంగా ప్రోత్సహిస్తోందని తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజయరం, కుప్ప శ్రీనివాస ప్రసాద్, చంద్ర స్వామి, పురుషోత్తం గుప్తా, సంగమేశ్వర చారి, ఎం.పవన్ కళ్యాణ్, బండారు శ్రవణ్ రెడ్డి, శంకర్ యాదవ్, కుంకు బాలాజీ, గణేష్ వర్మ, సురేష్, మహబూబ్, జోషి, బాలాజీ, వినోద్ మరియు ఇతర గోరక్షకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్ళలో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/భువనగిరి** : భువనగిరి మండలం వనపర్తి ఐకెపి కేంద్రాన్ని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించి రైతులతో మాట్లాడిసమస్యలు తెలుసుకున్న అనంతరం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారంలో వరి కోతలు ప్రారంభం కాగా 25 రోజుల పైబడి వడపర్తి ఐకెపి కేంద్రం వద్ద ధాన్యం మార్కెట్ కు తెచ్చిరైతులు పడిగాపులు పడుతున్న ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. మిల్లర్లు ఏ గ్రేడ్ ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత మిల్లుకు పోయినంక బి గ్రేడ్ గా ట్రేడ్ చేసి లక్షలాది రూపాయలు రైతాంగం నుండి దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ఐకెపి, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాల్లో దాన్యం కొనుగోలను వేగవంతం చేసి మే 15 నాటికి పూర్తి చేయాలని ఇప్పటికే వాతావరణ శాఖ రుతుపవనాలు ముందుగానే వస్తాయని హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని వరి ధాన్యం కొనుగోలువేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పొండాల మైసయ్య, మెరుగు ఈశ్వరయ్య, సింగం కృష్ణవేణి, ఎలిమినేటి సంతోష్ రెడ్డి, మన్నే నరేందర్ రెడ్డి, బబ్బలి భగవంతు రెడ్డి, అవిశెట్టి రామకృష్ణ, ఎలిమినేటి సురేష్ రెడ్డి, తోటకూరి శ్రీశైలం, ఎర్రబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ కార్యక్రమం



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి గ్రామంలో శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మరియు ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంబాలపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహించే మహాలక్ష్మమ్మ అమ్మవారి పండుగ డిసెంబర్ నెలలో ఉంటుందని గ్రామ పెద్దల సమక్షంలో ధ్వజస్తంభం నిర్వహిస్తూ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుండడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏడుపుల రమాదేవి గోవింద్, నర్సింహా పాల్గొన్నారు.




## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా ఆదివారం కురిసిన అకాల వర్షానికి మండలంలోని ఐకేపి, పిఏసిఎస్ కేంద్రాలలో రైతులు తీసుకువచ్చిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దైన నేపథ్యంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకుందామనే లోపే అకాల వర్షం కారణంగా తడిసి రైతన్నకు నష్టం కలిగే ప్రమాదం ఉన్నందున కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసిన రైతులకు నష్టం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

## ఉదయం మండుటెండలకు మగ్గిన ప్రజలు

**సాయంత్రం ఉరుములతో ఉపశమనం**



**ప్రజాపక్షం/నందికొండ:** ఉదయం నుంచే మండిపడిన ఎండలతో నాగార్జునసాగర్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సూర్యుడు నిప్పులు చెరగడంతో బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది.మధ్యాహ్న సమయంలో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరడంతో రోడ్లు వెలవెలబోయాయి.అయితే సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటుచేసుకుంది.ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రాంతం ఒక్కసారిగా చల్లబడింది.ఉదయం నుంచి ఎండలతో అల్లాడిన ప్రజలకు ఈవాన ఊరటనిచ్చింది.ఈఅకస్మాత్తు వాతావరణ మార్పు కారణంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది.పలుచోట్ల లైన్లు తెగిపోవడం,ఫీడర్లు ట్రిప్ కావడంతో గంటల తరబడి విద్యుత్ నిలిచిపోయింది.దీంతో గృహా లు, వ్యాపార దుకాణాల వారు ఇబ్బందులు పడ్డారు.అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ,దెబ్బతిన్న లైన్ల మరమ్మతు పనులు చేపట్టారు.

## రూ.5కే శుద్ధజలాలు

**ప్రజాపక్షం/తుంగతుర్తి:** తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామంలో పేదలకు అందుబాటు ధరలో శుద్ధమైన తాగునీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్ను ప్రారంభించారు. శ్రీ లలిత భవాని శంకర జల నిలయం ఆధ్వర్యంలో కేవలం రూ.5కే క్యాన్ వాటర్ అందించే ఏర్పాటు చేశారు.దాతల సహకారంతో ప్లాంట్ నిర్మాణంఈ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి డాక్టర్ వందనపు అచ్చితం దాతగా నిలిచారు.కేతిరెడ్డి గోపాల్ రెడ్డి తండ్రి కేతిరెడ్డి సుధాకర్ రెడ్డి స్మారకార్థంగా షెడ్డు నిర్మాణం చేపట్టారు. ప్లాంట్ నిర్మాణ పనులను దారం రామ నరసయ్య కుమారులు పూర్తి చేశారు. మాజీ ఎంపీపీ కేతిరెడ్డి గోపాల్ రెడ్డి ప్లాంట్ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతకుంట్ల మనోజ్,ఉప సర్పంచ్ అజిత ప్రసాద్, మాజీ సర్పంచ్ రచ్చ బాలాజీ, దారం సోమయ్య,రిటైర్డ్ టీచర్లు జోగునూరి సుందర్రావు,జోగునూరి రాజు,వార్డు మెంబర్లు,మాజీ ఉప సర్పంచ్ పబ్బతి స్వామి తదితరులు పాల్గొన్నారు.



# భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం...







## అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 67వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలో వక్తలు

**ప్రజాపక్షం/వలిగొండ :** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 67వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలోని సిపిఐ ప్రాంగణంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మారోజు నరసింహ చారి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ ఏఐవైఎఫ్ యొక్క ఘనమైన చరిత్రను, భగత్ సింగ్ ఆదర్శాల పట్ల దాని అచంచలమైన నిబద్ధతను గుర్తుచేసుకుంటూ, ఉపాధి, విద్య, సామాజిక న్యాయంతో సహా యువత హక్కుల కోసం పోరాడటానికి తమ అంకితభావాన్ని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు సల్వాద్రి రవీందర్, బొడిగే సుదర్శన్, ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి గుండెగాని నాగరాజు, కనకబోయిన నందు, ఎంగోజు ప్రశాంత్, నానచర్ల సాయి నితిన్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి;** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాబ్ క్యాలెండర్లను ప్రకటించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవంను పోరాట దినంగా పరిగణిస్తూ ఏఐవైఎఫ్ డిండి మండల సిపిఐ ప్రజా భవన్ వద్ద ఏర్పాటు చేసిన యువజన జెండాను నవీన్ ఎగరవేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ 1959మే 03న ఆవిర్భవించిందని, భారతదేశ యువత ఈరోజు తీవ్రమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు పరిశీలిస్తే ప్రభుత్వ నియామకాలు తగ్గించబడుతున్నాయని, ప్రైవేటీకరణ వేగవంతం అవుతోందని, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరగుతున్నాయని, విద్య ఖర్చులు పెరిగి యువతపై భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎఐవైఎఫ్ డిండి మండల అధ్యక్షులు నరేష్, కోశాధికారి మధుకర్, వినయ్, ప్రవీణ్, గోవర్ధన్, కొండల్, చక్రి, శ్రీను, సైదులు, కోటేష్, ప్రణీత పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** దేశ యువత హక్కుల కోసం పోరాట పదంలో ముందంజలో నిలిచిన ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ న్యూఢిల్లీ 1959 లో ఆవిర్భవించిందని, యువజన ఉద్యమాల సారథి (ఏఐవైఎఫ్) 67వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత యువజన సమాఖ్య జెండాను మాజీ యువజన నాయకుడు దుబ్బాక భాస్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యుడు శనిగల నరేష్, మాజీ యువజన నాయకులు బచ్చనగోని గాలయ్య, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ,గడ్డం యాది, కొండూరు అఖిల్, మల్లికార్జున్, వరికుప్పల రాకేష్ , కొండూరు నరేష్, లోడే చరణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** కామ్రేడ్ భగత్ సింగ్ దళఆశయాలను ముందుకు తీసుకెళ్ళి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని మోటకొండూర్ మండల ఎఐవైఎప్ ఆధ్యక్ష, కార్యదర్శులు గోట్టిపాముల సునిల్, బీరకాయల మదులు అన్నారు. వారు ఆదివారం మోటకొండూరు మండల కేంద్రంలో అఖిలభారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) 67వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏఐవైఎఫ్ జండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఆలేటి బాలరాజు, జీవీకేలపల్లి పొండు, ఏఐవైఎఫ్ నాయకులు ఆడేపు నరేష్, నరసింహ, గణేష్, ఆలేటిసాయి, గడ్డం శీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో కార్మిక ఉద్యమాల బలోపేతం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మేడే స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలను బలోపేతం చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్‌లు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ లక్కవరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలో ఉన్న ప్రభుత్వం కాలరాస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌలుదారుల రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు యల్లావుల రమేష్ పాల్గొన్నారు.



## ప్రజా ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల



మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాప్రభుత్వం ద్వారానే సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జంకుతండాలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో ప్రారంభించి మాట్లాడారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవాళ్లకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వలేకపోయిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లు పేదలకు అందించేందుకు చర్యలు చేపడ్తామన్నారు. పేదలకు సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించామన్నారు. సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆలయ పునర్‌నిర్మాణానికి కృషి – ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండల పరిధిలోని రుద్రవరం, లక్ష్మీ పురం గ్రామాల శివారులో కాకతీయుల కాలం నిర్మించిన అతి పురాతన రుద్రేశ్వర త్రికూటాలయ పునర్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాకతీయుల కాలం నాటి పురాతన త్రికూటాలయాన్ని పరిరక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సాధినేని శ్రీనివాస్, చిలుకూరి బాలు, నూకల వేణుగోపాల్‌రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, స్కైలాబ్‌నాయక్, పిసికె.ప్రసాద్, దేశిడి శేఖర్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, రవినాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## దోపిడీ కేంద్రాలుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**ప్రజాపక్షం/నకిరేకల్:** ధాన్యం కొనుగోలు కేంద్రాలు దోపిడీ కేంద్రాలుగా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు.ఆదివారం పట్టణంలోని మూసీ రోడ్డులో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల జీవితాలు అంధకారంలోకి నెట్టబడ్డాయని,పంట వేసిన నాటి నుంచి అమ్ముకునే వరకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని, స్థానిక ఎమ్మెల్యే ప్రైవేటు వ్యక్తులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహింపజేస్తూ రైతులను దోపిడీ చేయిస్తున్నారని ఆరోపించారు.లారీలు రావ డం లేదని, కాంటాలు సకాలంలో జరగడం లేదని ప్రశ్నించిన రైతులపై దాడులు జరిగాయని,మొన్న నార్కట్‌పల్లి,నిన్న నకిరేకల్ మండలాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు.రైతులపై దాడి చేసిన స్థానిక ఎమ్మెల్యే



తక్షణమే రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పెండెం సదానందం,రాచకొండ వెంకన్న, గుండగోని జంగయ్య గౌడ్, మాద లక్ష్మీనారాయణ, గురర్రం గణేష్, భీమనబోయిన లింగరాజు,బాధిని రాము పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం ఆర్‌డిఒ కార్యాలయాల్లో ప్రజావాణి

**జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాలు**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.ఈకార్యక్రమం మే 4 నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తామని,రెవెన్యూ డివిజనల్ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆర్‌డిఓ కార్యాలయంలో సమర్పించవచ్చు అన్నారు.డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.ప్రజావాణికి వచ్చిన పిటిషన్లన్నింటినీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా కేందర్రంలో నిర్వహించే కార్యక్రమానికి ఇది కొనసాగింపుగా ఉంటుందని తెలిపారు.

## మే 4 నుంచి 9 వరకు రైతు వారోత్సవాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజా పాలప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 4 నుంచి మే 9 వరకు రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.మే 4న నేల ఆరోగ్య పరిరక్షణ,సమతుల ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం,5నఉద్యాన పంటల సాగు,ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపు, ప్రత్యామ్నాయ పంటల సాగు,6న బ్యాంకుల ద్వారా పంట రుణాలు,7న వ్యవసాయ క్షేత్రాలు, ఔర విద్యుత్ కేంద్రాలు,8న పశుసంవర్ధక శా పాడి పరిశ్రమ, పశుజాతి అభివృద్ధి,9ననీటిపారుదల శా గేట్ల నిర్వహణ,ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులు,కాలువలు, చెరువుల్లో కంపచెట్లు,గుర్రపు డెక్క తొలగింపు, సమతుల్య నీటి వినియోగం, కార్యాలయాల పరిశుభ్రతప్రతిరోజు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతులను భాగస్వామ్యం చేస్తూ విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## మే 4, 5 తేదీల్లో లుసాకాలో ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవ సదస్సు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం 2026ను పురస్కరించుకుని యునెస్కో,జాంబియా ప్రభుత్వం సంయుక్తంగా మే 4,5 తేదీల్లో లుసాకాలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎం.వి.గోన రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా పత్రికా మిత్రులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 2012 నుంచి ప్రపంచవ్యాప్తంగా భావప్రకటన స్వేచ్ఛ 10 తగ్గిందని,జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల్లో 85 కేసుల్లో శిక్షలు పడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల వల్ల తప్పుడు సమాచారం పెరిగి స్వతంత్ర జర్నలిజం ఆర్థికంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. జర్నలిస్టుల భద్రతను మెరుగుపరచడం,సమాచారాన్ని సామాజిక ఆస్తిగా కాపాడటం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.ఈ ప్రయత్నంలో అందరి భాగస్వామ్యం తప్పనిసరి అని గోన రెడ్డి పిలుపునిచ్చారు.

## జానయ్య విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్:** మండల పరిధిలోని చెట్ల ముకుందాపురం గ్రామంలో ఆదివారం దివంగత మాజీ ఎంపీటీసీ అంజనపల్లి పిచ్చమ్మ భర్త అంజనపల్లి జానయ్య విగ్రహావిష్కరణ జరిగింది. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మది వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సభ్యుల సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.రిబ్బన్ కట్ చేసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రిపై ప్రేమతో కుమార్తెలు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, సమాజ సేవలో జానయ్య అందించిన సేవలు ఎప్పటికీ నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాము,మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రణపంగా కృష్ణ, రైతు సంఘం కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ఉత్తమ మార్గంలో ‘సర్వోత్తముడు’

## నీతికి నిలువటద్దంగా ఆయన మార్క్...!!

## పేటపై పట్టు సాధించిన సర్వోత్తంరెడ్డి!!!







**ప్రజాపక్షం/సూర్యాపేట** : రాజకీయాల్లో రాణించే ఏ నాయకుడైనా అనతి కాలంలోనే అంచెలంచెలుగా ఎదగడం తోపాటు ఆర్థికంగా బలపడేందుకు నాలుగు రాళ్లు వెనుకేసు కోవాలని తహతహలాడడం అందరికి తెలిసిందే. కానీ అందుకు భిన్నంగా ఉత్తమ మార్గంలో పయణించి తనను నమ్ముకున్న ప్రజలను, కింది స్థాయి నాయకులకు సర్వం తానై నిలిచేవారు నేడు అరుదు. ఇలాంటి కోవలో నిన్న మొన్నటి వరకు తండ్రి చాటు బిడ్డగా ఉన్న మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మొదటి వరుసలో ఉన్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. నీతికి నిలువటద్దంగా నిలుస్తూ రాజకీయ ఉద్ధండలకు నెలవైన సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాలలో ఎదుటి వారి ఎత్తులను చిత్తుచేస్తూ తక్కువ కాలంలోనే రాజకీయంగా ఎంతో పట్టు సాధించారు.

సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాలలో కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి 1 అక్టోబర్ 2025న అనారోగ్యంతో మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. మరణానంతరం ఆయన తనయుడు ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి పుట్టెడు దుఃఖంలో ఉన్నా గత ఏడు మాసాలు నుండి అది దిగమింకుకొని తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ పార్టీ అభ్యున్నతితోపాటు నాయకులకు, కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తున్నారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ నేను మీకు ఉన్నాననే బరోసా ఇస్తున్నాడు. ఇటీవల కాలంలో జరిగిన గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడంలో ఆయన ఎంతో చెమటోడ్చాడు. అత్యధిక స్థానాల్లో అభ్యర్థులను ఒంటిచేతితో గెలిపించి ప్రతిపక్ష పార్టీల రాజకీయ ఉద్ధండులకు ముచ్చెమటలు పట్టించారు. వరుసగా రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోవడం నేడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా సూర్యాపేటలో శాసనసభ్యులుగా గెలవకపోవడం నిరాశ నిస్పృహాలతో ఉన్న సూర్యాపేట నియోజక వర్గ పార్టీశ్రేణుల్లో సర్వోత్తముడి రాక, గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ఫుల్ జోష్ నెలకొంది. ఆర్థికంగా చితికిపోయిన కార్యకర్తల కుటుంబాలకు నేను ఉన్నానంటూ బరోసా కల్పిస్తూ తనకు కలిగిన దానిలో హార్థిక, ఆర్థిక సహాయం చేస్తూ ముందుకు సాగుతున్నారు.

రాజకీయాల్లో ఉత్తమ మార్గంలో నడువాలని... నీతికి నిలువటద్దంగా ఉండాలని... ప్రజాసేవలో ప్రజలచేత కీర్తింప బడాలని పార్టీశ్రేణులకు పదే పదే చెప్పుతూ ఆయన మార్క్‌ను చూపుతున్నారు. సివిల్, ఇతర సెటిల్‌మెంట్ల జోలికి వెళ్ళవద్దని న్యాయం చేయాలని తమను శరణగోరి వచ్చిన వారు చెప్పిన దానిలో నిజానిజాలు తెలుసుకొని అండగా నిలిచి ఏమి ఆశించకుండా పనిచేయాలని చెప్పుతుండడంతో అటు అధికారులు, ఇటు నాయకులు ఎవరూ కూడా ఆయన చెబుతున్న మాటలకు ఫిదా అవుతూ సేవే మార్గంగా ముందుకు సాగుతున్నారు. అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా నేను తప్పు చేసినా... నా పక్కన ఉన్న వారు తప్పు చేసినా... నిర్భయంగా అడగండి దానికి నేను బాధపడను. సమాజ మార్పు కోసం మీరు నేను ముందుకు సాగుదామంటూ మీడియా ప్రపంచానికి కూడా పిలుపునివ్వడం గమనార్హం. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాలుకు బలపం కట్టుకొని రెండు నియోజక వర్గాల్లో తిరుగుతూ ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికి అక్కడే పరిష్కార మార్గం చూపుతున్నారు.

సూర్యాపేట నియోజక వర్గంతోపాటు తుంగతుర్తి నియోజక వర్గంలో రాజకీయంగా సర్వోత్తమ్ రెడ్డి అనతికాలంలోనే ఎంతో పట్టు సాధించాడు. రాజకీయ ఉద్ధండులకు నెలవైన ఈ ప్రాంతాలలో తన మార్క్‌ను చాటుతున్నాడు. రాజకీయాలు అనేవి ఎన్నికల వరకే అంటూ పార్టీలకు అతీతంగా అభివృద్ధే మంత్రంగా ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫాదర్ అయినా... గాడ్ ఫాదర్ అయినా... తనకు అన్ని అతనేనంటూ ఆయన సూచనలు, సలహాలతో ప్రజల్లో దూసుకుపోతున్నారు. దీనితో అనతికాలంలోనే తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయంగా నిలదొక్కుకొని సర్వం ఉత్తముడే అంటూ ప్రజలతో మన్ననలు పొందుతున్నాడు.

# సమగ్ర కార్మిక చట్టం తేవాలి : లోడంగి శ్రవణ్ డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ (నార్కట్‌పల్లి):** గ్రామీణ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రభుత్వం సమగ్ర కార్మిక చట్టం తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లోడంగి శ్రవణ్ పిలుపునిచ్చారు.ఆదివారం పల్లెపహాడ్‌లో మేడే దినోత్సవం సందర్భంగా పార్టీ పతాకాన్ని శాఖ కార్యదర్శి ఆలకుంట నరసింహ ఎగరవేశారు.ముఖ్య అతిథిగా హాజరైన శ్రవణ్ మాట్లాడుతూ పాలకులు ప్రజల అభివృద్ధిని పట్టించుకోకుండా పెట్టుబడిదారులకు తొత్తులుగా మారారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి 10 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు ప్రైవేట్ వ్యాపారులతో కలిసి చట్టాలు రూపొందిస్తోందని ఆరోపించారు.కనీస వేతన చట్టాల అమలులో,గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడంలో కేంద్రం విఫలమైందన్నారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, గ్రామ నాయకులు సంగిశెట్టి శ్రీనివాస్,సీలోజు వెంకటయ్య,వనం శివరాములు,మంటిపల్లి మల్లయ్య,జెల్ల దశరథ,పెండ్యాల ఎల్లయ్య,చిన్న ఎల్లయ్య,దుబ్బ నరసింహ,ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### పోరాటాలతోనే హక్కులు సాధ్యం

**ప్రజాపక్షం/దేవరకొండ**; కార్మిక ఉద్యమాల రథసారధి ఎర్రజెండా అని పోరాటాలతోనే హక్కులు సాధ్యమవుతాయని ఏఐటీయూసీ నల్గొండ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అన్నారు. ఆదివారం మేడే వారోత్సవాలలో భాగంగా దేవరకొండ మండలం కట్టకొమ్ముతండ గ్రామ పంచాయతీ బాపూజీనగర్‌లో భవన నిర్మాణ కార్మికుల జెండాను ఆయన ఎగరవేశారు. ఈసందర్భంగా రామస్వామి మాట్లాడుతూ 1886లో అమెరికా దేశంలోని చికాగో నగరంలో 8 గంటల పనిదినం కై కార్మికులు రక్తంతో తడిసిన ఎర్ర జెండా నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎగుతుందని అన్నారు. కార్మికుల బలిదానాలు, రక్త తర్పణాలతో మేడే చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పటిష్టం చేయాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నేటికి అమలు చేయడంలేదని అన్నారు. ఈకార్యక్రమంలో దండుగల నర్సింహా, పరశురాములు, శ్రీను, సైదులు, రాములు, వెంకటయ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.






## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని చైతన్య పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న 1998/99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 26 సంవత్సరాల తర్వాత ఆదివారం పట్టణంలోని జివిపి ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూకల నరేందర్‌రెడ్డి, దాచేపల్లి దయాకర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, చిన్నప్ప రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గొట్టె శ్రీను, గిరి, నసీరుద్దీన్ పాల్గొన్నారు.

## రైతుల వారం కార్యక్రమం జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా క్లస్టర్ సిరిపురం, నారాయణపురం, కాగితరామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతుల ఆధ్వర్యంలో రైతుల వారం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, కార్యదర్శులు, ఆదర్శ రైతులు, గ్రామాల పెద్దలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.